క్లుప్తంగా

కఠినచర్యలు తీసుకోవాలి

జనగామ : కొమురవెల్లి మండలం గురువన్న పేటలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బాధితురాలి తల్లితో ఎమ్మెల్యే మాట్లాడి ధైర్యం చెప్పారు. విచారణ సమయంలో ఒత్తిడికి లొంగకుండా, అత్యంత కఠినంగా శిక్ష పడేలా చూసి, మరోసారి పునరావృతం కాకుండా చూడాలని సిద్దిపేట కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



చిల్పూరు : మండల కేంద్రంలో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న రిబ్కా ఆదివారం తన స్కూటీపై వెళ్తుతుండగా వెంకటేశ్వరపల్లి వద్ద సెల్‌ఫోన్‌తో ఉన్న బ్యాగు కిందపడి పోయింది. ఇంటికి వచ్చాక స్కూటీకి తగిలించిన బ్యాగు కనిపించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా కానిస్టేబుళ్లు సెల్‌ఫోన్‌ను వెతికి ఆమెకు అప్పగించారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి

పాలకుర్తి : జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యారంగ విధానాన్ని సమూలంగా మార్చేక్రమంలో ఎదురవుతున్న సమస్యలను అన్ని కోణాల్లో ఆలోచించాలని సూచించారు.

దుర్గామాత జాతరకు ముహూర్తం ఖరారు

జనగామ : జనగామ పట్టణం బతుకమ్మకుంట ప్రాంగణంలోని శ్రీ విజయదుర్గా మాత జాతరను వచ్చే నెల 15, 16, 17వ తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారం అమ్మవారి సన్నిధిలో వివిధ సామాజిక వర్గాల పెద్దలు, రాజకీయ పార్టీ నాయకులు, వ్యాపార వర్గాలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పండుగ తేదీలను ఏకగ్రీవంగా తీర్మానం చేసి, ప్రకటించారు. ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి, మొదటగా బాలాలయ నిర్మాణం చేపట్టి శివాలయంలోని స్వామి వారి విగ్రహాలను అందులోకి మార్చి, అనంతరం ఆలయ నిర్మాణం మొదలు పెట్టాలని పురోహితులు సూచించినట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన వేముల సురేష్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు గ్రామ సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5వేలను ఆర్థికసాయాన్ని అందించారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వేముల శ్రీనివాస్, కలకుంట్ల స్వామి, కోల రమేష్ పలువురు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో దైవజ్ఞానం

బచ్చన్నపేట : ఆధ్యాత్మికతతో దైవజ్ఞానం అలవడుతుందని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞానవేదిక సభ్యులు అన్నారు. ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను మండలంలోని ఆలింపూర్‌లో పరిచయం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భగవద్గీతను చదివి అందులోని సారంశమును అర్థం చేసుకొని ధర్మబద్ధమైన జీవితం కొనసాగించాలన్నారు. ఇందు జ్ఞాన వేదిక భువనగిరి, చేర్యాల, జనగామ, తొర్రూర్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పాత జాబితానే ప్రచురించారు

జనగామ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెండ్రోజుల క్రితం ప్రకటించిన తుది ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని పెంబర్తి గ్రామానికి చెందిన అంబాల రఘునాథ్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని, చేర్పులు, మార్పులు చేయాలని దరఖాస్తు చేసుకుంటే, పాత లిస్టుతో అదే జాబితా ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీ పగ్గాలు అప్పగించాలి

దేవరుప్పుల : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని నియమిస్తే పార్టీని బలోపేతం చేస్తారని సీనియర్ నాయకుడు ఉప్పల సురేష్‌బాబు అధిష్టానాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఝాన్సీరెడ్డికిపార్టీ పగ్గాలు అప్పగించాలన్నారు.

సభను జయప్రదం చేయండి

జనగామ : ధర్మకంచ సంగరికాలనీలో జరిగే బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొట్ల శేఖర్ కోరారు. ధర్మకంచ శాఖ కార్యదర్శి బొట్ల శ్రావణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

పల్లెల్లో గం‘జాయ్’

- బానిసలుగా మారుతున్న యువత
- ఆర్డర్, సరఫరా అంతా కోడ్ భాషలోనే..
- నియంత్రణపై పోలీసుల ప్రత్యేక నిఘా



రఘునాథపల్లి : పచ్చని పల్లెల్లో గంజాయి మత్తు చిత్తు చేస్తోంది..మండలంలోని పలు గ్రామాల్లో యువత గం'జాయ్'కి బానిసలవుతున్నారు. గతంలో ఏరులై పారిన గుడుంబా దాదాపు నియంత్రణలోకి రాగా.. ఇప్పుడు కొత్త మత్తు పడగవిప్పుతోంది.గణపతి ఉత్సవాల్లో పలు గ్రామాల్లో గంజాయి మత్తు బయటపడింది. ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో పలువురు యువకులు కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. ఇదేంటని ఆరా తీస్తే..గంజాయి వాసన బయటికొచ్చింది. తక్కువ ఖర్చు..ఎక్కువ మత్తుకు అవకాశం ఉండడంతో యువకులు గంజా తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 15 రోజుల క్రితం 21 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. 'ఏంటీ దారుణం. పిల్లలు బయటకు వెళ్లి ఏం చేస్తున్నారో అర్థం కావడం లేద'ని ఓ యువకుడి తండ్రి ఆందోళన వ్యక్తం చేశాడు. గుట్టలు, చెట్లు, కాల్వల ప్రాంతాలను అడ్డాగా చేసుకొని యువత గంజాయి తీసుకుంటున్నారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారముందని, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు నిఘా పెట్టినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీరియస్

ఆయా గ్రామాల్లో యువత గంజాయి తీసుకుంటున్నారని పలువురు తల్లిదండ్రులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల వెల్ది మోడల్ స్కూల్ సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే అక్కడే సీఐ, ఎస్సై, అధికారులతో సమావేశమై గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

ఆర్డర్, సరఫరా అంతా కోడ్ భాషలోనే..

గంజాయి వ్యాపారం గుట్టుగా సాగుతోంది. ఆర్డర్, సరఫరా అంతా కోడ్ భాష రూపంలో జరుగుతున్నట్లు సమాచారం. కోడ్ ఆధారంగా ఎంత కావాలి..? మోతాదు ఎంత అన్నది మాట్లాడుకుంటున్నారు. అలవాటు పడిన పిల్లలు.. పదే పదే తీసుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి నివారించాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం..



గంజాయి నిర్మూలనపై ప్రత్యేక నిఘా ఉంచాం. టెస్టింగ్ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి.ఎవరైనా గంజాయి తీసుకున్నట్లు కనిపిస్తే టెస్ట్ చేస్తే బయటపడతారు. పిల్లలు ఏం చేస్తున్నారు..? వారి ప్రవర్తన ఎలా ఉంది..? వంటి విషయాలను తల్లిదండ్రులు గమనించాలి. మాదక ద్రవ్యాలపై ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి. గంజాయిని నియంత్రించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రత్యేక దృష్టి సారించాం.

-దూదిమెట్ల నరేశ్ ఎస్సై, రఘునాథపల్లి

‘నా ఆలోచన’తో అద్భుత చిత్రాలు



గీసిన చిత్రాలతో రాజేశ్వర్‌రెడ్డి



నా ఆలోచనలో రూపుదిద్దుకున్న చిత్రాలు

- రాజేశ్వరుడి చేతికుంచె బాల్ పెన్ను..

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కేశిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బాల్ పెన్నుతో చిత్రాలు గీయడంలో దిట్ట.. రాజేశ్వర్‌రెడ్డికి చిన్ననాటి నుంచే బొమ్మలు గీయడం అలవాటు.. డిగ్రీ పూర్తి అయిన తర్వాత టీటీసీలో డ్రాయింగ్ కోర్సు తీసుకుని సర్టిఫికెట్ అందుకున్నాడు. అదే సమయంలో డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగం వస్తుందని ఎదురు చూశాడు. కానీ అది సాధ్యం కాకపోవడంతో గ్రామానికి చేరుకున్నాడు. ఒక రోజు రైతులకు పంటల విషయంలో అవగాహన కల్పించే ఆలోచనతో కర్షక నేస్తం పేరుతో యూట్యూబ్ ఏర్పాటు చేసి అందులో పంటల సాగు విధానం తదితర వాటిగురించి తెలియజేసేవాడు. దీంతో పాటు నా ఆలోచన పేరుతో పేదరికం, పొల్యూషన్, కార్మికులు, కర్షకులు, నిత్యం జరిగే సంఘటనలు లాంటి చిత్రాలను అప్పటికప్పుడు బాల్ పెన్నుతో గీయడం వాటిని పోస్ట్ చేస్తున్నారు. రైతు నేస్తం గురించి తెలుసుకున్న హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్ర వేత్తలు రాజేశ్వర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించడమే కాకుండా అక్కడ నూతన పంటల సాగు విషయంలో ఏర్పాటు చేస్తున్న ప్రతీ కార్యక్రమానికి ఆహ్వానం పంపుతున్నారు. అలా నిత్యం ఎక్కడ ఏ సంఘటన జరిగినా అతని చేతి కుంచె నుంచి బాల్ పెన్నుతో చిత్రాలు గీస్తూ అందరిని కట్టి పడేస్తున్నాడు.

అమ్ముడుపోయి ఆరోపణలా!

- డీసీసీ అధ్యక్షుడిపై విమర్శలు సరికాదు
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ : బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడు పోయిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు.. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బనుక శివరాజు యాదవ్, బడికె ఇందిర, మేడ శ్రీనివాస్, కామిడి జీవన్‌రెడ్డి మాట్లాడారు. మచ్చలేని నాయకుడు కొమ్మూరిపై అర్థంలేని ఆరోపణలు చేయడం పద్ధతి కాదని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల డబ్బులకు ఆశపడి, అమ్ముడు పోయి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే నాయకులు ఇష్టం లేకపోతే బయటకు వెళ్లి పోవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే కంచె రాములుకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి వచ్చిందని మరచి పోవద్దన్నారు. మీకు నామినేటెడ్ పదవులు ఇస్తే బీసీలకు న్యాయం చేసినట్టు, పార్టీ కోసం కష్టపడుతున్న ఇతర బీసీ వర్గాలకు చెందిన నాయకులకు కట్టబెడితే బీసీ ద్రోహులు అంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రమల్ల సుధాకర్ పొన్నాల లక్ష్మయ్య, వైశాలితో వ్యవహరించి తీరు ఇక్కడి ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, జనగామ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, నాయకులు వంగాల మల్లారెడ్డి, గంగం నరసింహారెడ్డి, పిన్నింటి కావ్య శ్రీరెడ్డి, జక్కుల అనితవేణుమాధవ్, బొట్ల శ్రీనివాస్, మంత్రి సుమలత శ్రీశైలం, మ్యాక మల్లేశం, మెరుగు బాలరాజు గౌడ్, మిద్దెపాక సిద్దులు తదితరులు ఉన్నారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి

బచ్చన్నపేట : తపాస్‌పల్లి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, బచ్చన్నపేట మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపాలని బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ చెరువులు నింపిన తర్వాతే గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, నాయకులు గంగం సతీష్‌రెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, రాజనర్సు, మధుప్రసాద్, స్వామి, రాజు, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఆజీమ్, ఫిరోజ్, రైతులు పలువురు పాల్గొన్నారు.

సామాన్యుల ఇళ్లను కూల్చొద్దు

దేవరుప్పుల : హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో సామాన్యుల ఇళ్లను కూల్చడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు నీలారపు శ్రీపాల్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పేదలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, హైడ్రాపై ఉందన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



చిల్పూరు : చిల్పూరు మండలంలోని చిన్న పెండ్యాల, ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేస్తే రెండు గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. భారీ వర్షాల సమయంలో ఇక్కడ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కేవలం అరకిలో మీటరు దూరంలో ఉండే పెద్దపెండ్యాలకు వెళ్లాలంటే దాదాపు 8 కిలో మీటర్లు అదనంగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని స్థానికులు తెలిపారు. తక్షణమే ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆదుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆయా గ్రామాల ప్రజలు విన్నవించారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం



బచ్చన్నపేట: నినాదాలు చేస్తున్న ఇర్రి అహల్య



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

బచ్చన్నపేట : ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య అన్నారు. ఆదివారం మండలంలోని కేసిరెడ్డిపల్లిలో పార్టీ గ్రామ శాఖ మహాసభలను ఇమ్మడి బుచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై రోజురోజుకు లైంగికదాడులు, అత్యాచారాలు జరుగుతున్నా వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వాలు చేసే వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని అందుకు సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు.అనంతరం మండల కార్యదర్శిగా శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేష్, మిన్నాలపురం ఎల్లయ్య, రవీందర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహులు, లక్ష్మణ్, మధు, అనిత, పలువురు పాల్గొన్నారు.

పేదల హక్కుల కోసం ఎర్రజెండా..

తరిగొప్పుల : పీడిత ప్రజల హక్కుల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా పోరాడుతుందని, సీపీఎం బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు పిలుపునిచ్చారు. మండలంలోని పోతారంలో ఆదివారం గ్రామశాఖ మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, సుంకు రాజు, ఎండబట్ల కుమారస్వామి, కనుకయ్య, శ్రీను, సోమరాజు, బాలరాజు, సాయిలు, బాలయ్య, జగన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పేదలకు అండగా కమ్యూనిస్టులు

జఫర్‌గఢ్ : పేదలకు అండగా నిలిచేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో ఎర్ర రవి అధ్యక్షతన సీపీఎం గ్రామ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి మతాల పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు.స్థానిక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం పార్టీ గ్రామ నూతన కార్యదర్శిగా కొమురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు యాతం సమ్మయ్య, నంచర్ల సోమయ్య, రాపర్తి ఊర్మిళ, యాతం ఎలేంద్ర, సీరటి నాగమ్మ, ఎర్ర నాగమ్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం..

రఘునాథపల్లి : కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కేంద్రంలోని మోదీ సర్కార్ ఊడిగం చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని గబ్బెటలో సీపీఎం గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలిసి సీపీఎం జెండా ఆవిష్కరించారు. అనంతరం నూతన గ్రామశాఖ కార్యదర్శిగా ముక్కెర నాగరాజును ఎన్నుకున్నారు. నాయకులు ఇంజ వెంకటస్వామి, పోషబోయిన అంజయ్య, వంగ సత్తిరెడ్డి, ముక్కెర తిరుపతి, సోమన్న, కనకరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని రంగరాయగూడెం, కోమటిగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ డిమాండ్ చేశారు. అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల్లో ఆదివారం సీపీఎం గ్రామ మహాసభలను నిర్వహించగా రమేష్ మాట్లాడారు. కోమటిగూడెం, రంగరాయగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలు, విద్యార్థుల సమస్యల్ని గుర్తిస్తూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. అనంతరం అక్కపెల్లిగూడెం గ్రామ కార్యదర్శిగా యారా మోహన్, కోమటిగూడెం కార్యదర్శిగా ఈదునూరి యాకయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడుదుల జ్యోతినర్సిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, కొడెపాక యాకయ్య, యార సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పాలకుర్తి టౌన్: జానపద పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



జఫర్‌గఢ్ : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సభ్యులు

పాలకుర్తి టౌన్ : మండలంలోని వావిలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పోతుగంటి నర్సయ్య తెలిపారు. కాగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కొనుకటి రాణి, మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు..

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సుతారి రిషిత, అక్షయ, వేముల హేమంత్, పల్లె గౌతమి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అకుల సాయికుమార్ ఆదివారం తెలిపారు. అక్టోబర్ 4న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరఫున వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖ అధికారి ఎండీ పర్వేజ్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షులు అయోధ్య, జిల్లా కోశాధికారి కాటం రాజిరెడ్డితో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జాతీయ రహదారిపై మక్కలు

- వాహనదారులకు తప్పని తిప్పలు



చాగల్లులో జాతీయరహదారిపై ఆరబోసిన మక్కలు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండల పరిధిలోని జాతీయ రహదారితో పాటు పలు గ్రామాలకు వెళ్లే అంతర్గత బీటీ రోడ్లపై రైతులు మొక్కజొన్నలను ఆరబోస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మండల పరిధిలోని చాగల్లు, రాఘవాపూర్ గ్రామాల్లో రైతులు జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా మక్కలను ఆరబోస్తున్నారు.అదే విధంగా మీదికొండ, కొత్తపల్లి, విశ్వనాథపురం, ఇప్పగూడెం తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. రోడ్డుపై ధాన్యం, మక్కలు ఆరబోస్తుండగా రాత్రి వేళల్లో సరిగ్గా కనిపించక వాహనదారులు పలువురు గతంలో రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ జాతీయ రహదారి, సర్వీసు రోడ్డుపై ఇష్టారాజ్యంగా రైతులు మక్కలు ఆరబోస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై మక్కలు, ధాన్యం ఆరబోయకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అదేవిధంగా రైతులు ఈ విషయమై సానుకూలంగా ఉండాలని, రోడ్లపై కాకుండా వారి కల్లాల వద్ద ఆరబోసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బచ్చన్నపేట : ప్రింటర్ బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బచ్చన్నపేట : మండలంలోని కేసిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ని ర్వహించారు. చిన్ననాటి చిలిపి పనులు, ఆడుకున్న ఆటల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తమ బ్యాచ్ విద్యార్థులకు ఏ ఆపద వచ్చినా కలిసి ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. చదువు చెప్పిన గురువులను శాలువాలతో సన్మానం చేసి, జ్ఞాపికలను అందించి పాఠశాలకు ఆ బ్యాచ్ తరఫున ప్రింటర్‌ను బహూకరించారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు నర్సింహ్మారెడ్డి, లక్ష్మినారాయణ,ప్రభాకర్, రాజేశ్వరి, పూర్వ విద్యార్థులు అజయ్, శేఖర్, సుధాకర్, కృష్ణమూర్తి, కవిత, రేణుక, తిరుపతిరెడ్డి, హరిప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

రెండున్నర దశాబ్దాల తర్వాత..

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని రాఘవాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యాసంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు రెండున్నర దశాబ్దాల అనంతరం కలుసుకున్న బాల్య స్నేహితులు ఆత్మీయ పలకరింపులతో ఆలింగనాలు చేసుకున్నారు. చిన్నతనంలో చేసిన చిలిపి పనులు, అల్లరి చేష్టలను గుర్తుకు చేసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శోభారాణి, రాజయ్య, భిక్షపతి, రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు కందుల మధుసూదన్, మినుకూరి ఎలేందర్‌రెడ్డి, కాసాని పెద్దులు, బత్తిని మంజుల, కె.రేణుక, సీహెచ్.హేమలత, ఆర్.శంకర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్ /జఫర్‌గఢ్ : మండలంలోని నమిలిగొండ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోల భిక్షపతి తండ్రి హరికృష్ణ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. కాగా హరికృష్ణ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సందర్శించి పూలమాల వేసి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా గ్రామానికి చెందిన రిక్కల గౌరారెడ్డి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

జఫర్‌గఢ్ మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన తాటికాయల సునీల్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, రాయకులో కలిసి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సునీల్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార సోమిరెడ్డి, రాజ్‌కుమార్, మేర్గు రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు. కాగా సునీల్ మృతితో మహాజన ప్రజాపోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి రవికుమార్ సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నివాళి

దేవరుప్పుల : మండల కేంద్రానికి చెందిన దొంత ఇస్తారి ఆదివారం మృతిచెందాడు. కాగా ఇస్తారి మృతదేహానికి పలు పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయడెయిరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

జనగామ : మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తండ్రి కేవ్లానాయక్ ఇటీవల మృతిచెందారు. కాగా, ఆదివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పిచ్చిమొక్కలు తొలగించరూ?



దేవరుప్పుల : మండలంలోని కామారెడ్డిగూడెం పరిధి జనగామ–సూర్యాపేట రహదారి ఇరువైపుల పాదచారులు నడిచేలా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. కానీ ఫుట్‌పాత్‌లపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించే వారు కరువయ్యారు. ఈ రహదారి నిర్వహణ టోల్ పరిధిలోకి వస్తుందని స్థానిక పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఫుట్‌పాత్‌పై పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి పారిశుద్ధ్య లోపం లేకుండా పాదచారులు నడిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ : 9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (జనగామ)
ఎస్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)